# వ్యవసాయరంగంలో చొచ్చుకువస్తున్న సామ్రాజ్యవాద దిగ్గజ కార్పొరేషన్లు

**గత** నాలుగు దశాబ్దాల కాలంగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల కారణంగా భారత వ్యవసాయరంగం ఇప్పటికే తీవ్ర సంక్షోభంలో వుంది. చిన్న, సన్నకారు రైతాంగం నికృష్ట దారిద్ర్యంలోకి, దుస్థితిలోకి నెట్టబడ్డారు. మాన్‌శాంటో వంటి సామ్రాజ్యవాద దిగ్గజ విత్తన కార్పొరేషన్లు వేలాది పత్తి రైతుల ఆత్మహత్యలకు కారణమయ్యాయి. లాభాలు, రాయల్టీలు, సాంకేతిక సహాయం చేసినందుకు ఫీజులు మొదలైన రూపాల్లో భారత వ్యవసాయ రంగంలో సృష్టించబడిన మిగులునంతటినీ తమ దేశాలకు తరలించుకువెళ్ళిన తర్వాత ఇప్పటికీ ఈ సామ్రాజ్యవాద దిగ్గజ కార్పొరేషన్లు సంతృప్తిగా లేవు. వారు మన వ్యవసాయ రంగంలోకి వివిధ పద్ధతుల్లో జొరబడేందుకు నిరంతరాయంగా పథకాలు వేస్తున్నారు.

అలాంటి సామ్రాజ్యవాద దిగ్గజ కార్పొరేషన్లలో అంతర్జాతీయ సామ్రాజ్యవాద వ్యవసాయరంగ దిగ్గజ పరిశ్రమ వాల్‌మార్ట్ ఒకటి. ఇది ఇప్పటికే మనదేశ వ్యవసాయ రంగంలో చొచ్చుకొచ్చింది. వాల్‌మార్ట్ ఫౌండేషన్ అనే తన దాతృత్వ సంస్థ నుండి నిధులు పొందుతున్న లాభాపేక్షరహిత సంస్థలుగా చెప్పబడే వాని ద్వారా అది ప్రవేశించింది. దీనికి ప్రతిగా ఈ 'లాభాపేక్షరహిత సంస్థలు' రైతు– ఉత్పత్తిదారుని సంఘాలను (ఎఫ్‌పిఓ) ఏర్పరచి, 1.1. హెక్టార్లకన్నా తక్కువ భూమి కలిగి వున్న సన్న, చిన్నకారు రైతుల సమష్టిశక్తిని రూపొందించటం ద్వారా రైతాంగం విజయం సాధించేందుకు తాము సహకరిస్తామని మోసగిస్తున్నాయి.

మార్కెట్ యార్డులకు అనుసంధానం చేసే మౌలిక వసతుల నిర్మాణానికి రైతులకు సాంకేతిక సహాయన్నందిస్తామని, తద్వారా చిన్నకమతపు రైతుతన ఆదాయాన్ని పెంచుకోవచ్చునని, తమ జీవనాధారాలను మెరుగు చేసుకోవచ్చుననీ, ఆవిధంగా మధ్య దళారీల నుండి తప్పించుకోగలుగుతారని కూడా వారు ప్రకటిస్తున్నారు.

ఈవిధమైన మోసకారీ వాగ్దానాలతో, మార్కెట్ యార్డులకు అనుసంధానం కావటానికి సాంకేతిక మద్దతు, మౌలిక వసతుల కొరత కారణంగా దుస్థితినెదుర్కొంటున్న సన్న, చిన్నకారు రైతులను వశీకరించుకుని, మన దేశ వ్యవసాయరంగంలోకి వాల్‌మార్ట్ చొచ్చుకు వస్తోంది. వాల్‌మార్ట్ దాతృత్వ సంస్థ ఉపాధ్యక్షుడు కేంద్ర ప్రభుత్వ విధానాలకు తమ కంపెనీ అభినందనలు తెలుపుతోందన్నాడు.

గతంలో మధ్యఅమెరికా, మెక్సికోలలో ప్రయోగాలు నిర్వహించిన వాల్‌మార్ట్, 8 లక్షల మంది రైతులతో 500 ఎఫ్.పి.ఓ.లను ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణా, కర్నాటక, ఒడిషా, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ లలో (9 రాష్ట్రాల పరిధిలో) ఈ నెట్‌వర్క్ చట్రాన్ని ఏర్పరచటానికి ముందుకు సాగుతోంది. వివిధ పేర్లతో కొనసాగుతున్న లాభాపేక్షరహిత సంస్థలుగా చెప్పబడేవి–ఇప్పటికే కాఫీ, జీడిపప్పు, మింట్, మామిడి, కూరగాయలు, గోధుమ, చిరు ధాన్యాలను పండించే సన్న, చిన్నకారు రైతుల మధ్య పనిచేస్తున్నాయి.

వాల్‌మార్ట్ సంస్థ, 2020లో పదివేల ఎఫ్‌పిఓల ఏర్పాటుకు, మరో పదివేల నూతన ఎఫ్‌పిఓలను 2027–28 నాటికి ఏర్పరచే పథకాన్ని ప్రారంభించింది. ఆ విధంగా వాల్‌మార్ట్ రైతులతో అనుసంధానమైన నెట్‌వర్క్‌ను ఏర్పరచుకొని, దానిని పెంచుకుంటోంది.

టెక్నోసర్వ్, డిజిటల్ గ్రీన్, ప్రధాన్ వంటి 'లాభాపేక్ష రహిత సంస్థలు' 6 సం॥ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించాయి. అరకులోయలోని కాఫీ రైతులు, జీడిరైతులు, మహిళా రైతులు, మిరపరైతులు, ఆంధ్ర–తెలంగాణాలలోని జీడి, పసుపు రైతులతో ఈ సంస్థలు సంబంధాలు ఏర్పరచుకుంటూ దగ్గరయ్యాయి.

తమ జోక్యం కారణంగా జీడిపప్పు ధర 13 శాతం పెరిగిందని, రైతుల ఆదాయం 500 శాతం పైగా పెరిగిందని ఈ 'లాభాపేక్షరహిత' సంస్థలు ప్రకటించుకుంటున్నాయి. బ్లూటోకాయ్, స్టార్‌బక్స్ వంటి భారీ వ్యవస్థాగత కొనుగోలుదార్లను అనేకమందిని తాము రంగంలోకి తీసుకుని వచ్చి అరుకులోయ లోని కాఫీ గింజలు కొనుగోలు చేయించామని వారు ప్రత్యేకించి పేర్కొంటున్నారు. ఎఫ్‌పిఓల ద్వారా మెరుగైన పంట ఉత్పత్తులు, ఆదాయాలతో రైతులు లబ్ధిపొందారని వారు చెబుతున్నారు. రిలయెన్స్ స్టోర్‌వంటివి కొనుగోలుకు ముందుకు రావటంతో ఉత్పత్తి జరిగిన దానిలో అధికభాగం దేశీయంగా అమ్మకం జరుగుతోందని వారు ప్రకటిస్తున్నారు.

ఏమైనా, 'లాభాపేక్షరహిత' మధ్యవర్తుల ద్వారా కాఫీ, జీడి, పసుపు, మిర్చి పంటలను భారీ వ్యవస్థాగత కొనుగోలుదార్లకు విక్రయించి, సన్న, చిన్నకారు రైతులకు వాల్‌మార్ట్ ఎంత వరకు లబ్ధిచేకూర్చగలిగిందో తెలయరావటం లేదు.

అయితే, భారత వ్యవసాయరంగంలోకి ప్రవేశంతో వాల్‌మార్ట్ ఎంతో లబ్ధిపొందుతుందనేది వాస్తవం. లాభాల నాశించకుండా 3 కోట్ల 90 లక్షల డాలర్లను భారతదేశంలో వెచ్చించి ఎఫ్‌పిఓలను ఏర్పరిచే పనికి అది ఎన్నడూ పూనుకోదు.

ఈ తరహాలో రైతులతో ఎఫ్‌పిఓలను ఏర్పరచటం సాంప్రదాయ 'మండి' వ్యవస్థను నాశనంచేసి, ఉనికిలోవున్న సహకార సొసైటీలను బలహీనపరిచి, తద్వారా మొత్తం వ్యవసాయ మార్కెట్‌నంతటినీ ఈ సామ్రాజ్యవాద దిగ్గజ కార్పొరేషన్లు ఆక్రమిస్తూ సన్న, చిన్నకారు రైతులకు కీడును తలపెట్టవచ్చు. మనదేశంలోని వివిధ రాష్ట్రాలలో పొగాకు రైతుల

విషయంలో తరచుగా మనం చూస్తున్న విధంగానే మార్కెట్లపై గుత్తాధిపత్యం కారణంగా సమీప భవిష్యత్తులో ఈ రైతులంతా దివాళాతీసి, వారి చిన్నపాటి భూకమతాలను కూడా అమ్మి వేసుకునే పరిస్థితి వస్తుంది.

ఎఫ్‌పిఓల ద్వారా రైతులు వాస్తవంగా లబ్ధి పొందారో లేదో తెలియదు. అయితే వినియోగదారులకు మాత్రం కాఫీ, జీడి, పసుపు, మిర్చి ధరలు అసాధారణంగా పెరగటం ఓ కఠిన వాస్తవం. బహుశా రైతులకు అతికొద్ది మొత్తపు ఆదాయ పెంపు చూపి, వాల్‌మార్ట్ కొండ ప్రాంతాలను కొల్లగొడుతూ లాభాలను దండుకుంటోంది.

వాల్‌మార్ట్–మధ్యఅమెరికా, మెక్సికోలలో తన 'లాభాపేక్ష రహిత' సంస్థల ద్వారా ఏర్పరిచిన ఎఫ్‌పిఓలతో రైతులు పొందిన అనుభవాలు, పూర్తిగా బయటకు రావటంలేదు; వీటిని లోతుగా పరిశీలించాలి.

బహుశా, భారత వ్యవసాయ రంగంలోకి వాల్‌మార్ట్ చొరబాటు, భారతదేశంలోకి నాడు ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రవేశానికి మరో నగిషీ రూపమేమో!

అయితే ఓ విషయం స్పష్టం. వాల్‌మార్ట్ భారత వ్యవసాయ మార్కెట్‌లోకి ప్రవేశించటం లాభాపేక్ష దృష్టితోనే. బహుళజాతి దిగ్గజ కార్పొరేషన్ అయిన మాన్‌శాంటో మనదేశ రైతాంగ ప్రజాజీవితాలలో ఎంతటి ఉపద్రవం సృష్టించిందో మనం ఇప్పటికే చూశాం.

కనుక, భారత వ్యవసాయరంగంలోకి సామ్రాజ్యవాద దిగ్గజ కార్పొరేషన్ల ఈ తరహా చొరబాటును, ఈ చొరబాట్ల ఫలితంగా సంభవించే అనేక విపత్తులను వ్యతిరేకిస్తూ మనం అప్రమత్తంగా, మెలకువగా వుండాలి.

✱✱✱✱✱